క్లుప్తంగా

కేంద్రం నిర్ణయంతో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న డీలిమిటేషన్ నిర్ణయం వల్ల దక్షిణాది రాష్ట్రాలు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని మాదిగ సంక్షేమ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుండే రమేష్ చంద్ర అన్నారు. నూతనంగా నిర్మించిన పార్లమెంట్ భవనంలో ఎంపీలు కూర్చునే సీట్ల సంఖ్య పెంచడమే దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గురువారం మాదిగ సంక్షేమ సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన ఎంపీ స్థానాలు పెంచడం వల్ల కుటుంబ నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాల ఎంపీ స్థానాలు పెరిగి మరింత లాభపడి, కుటుంబ నియంత్రణని విధిగా భావించి పాటించిన దక్షిణాది రాష్ట్రాలు మరింత నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

సెక్షన్-1బి,ఇన్-పర్సన్ సెక్షన్‌ను తుంగలో తొక్కిన కేంద్రం

కవాడిగూడ: లా స్టూడెంట్స్, న్యాయవాది లేకుండా స్వయంగా కోర్టును ఆశ్రయించే వారి హక్కును సెక్షన్-1బి, ఇన్-పర్సన్ సెక్షన్‌ను తుంగలో తొక్కుతూ, ఇప్పటికి పూర్తిగా చంపేశారని న్యాయ విద్యార్థి నవీన్ ఆరోపించారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద శాంతియుత నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయం కోసం ఎవరైనా కోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొన్నారు. ఈ విషయం సీజేఐ చెప్పిన తరువాత కూడా పట్టించుకోవట్లేదన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్మీడియట్ బైపీసీ గ్రూప్‌లో ఆసక్తి ఉండి డాక్టర్ కావడమే లక్ష్యంగా ఉన్న నిరుపేద విద్యార్థులకు రెండు సంవత్సరాల పాటు ఆర్థిక చేయూత అందించనున్నట్లు మేథామైండ్ డైరెక్టర్ మనోజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడులకను పురస్కరించుకొని మొదటి వంద మంది విద్యార్థులకు బైపీసీతోపాటు నీట్ కోచింగ్ హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందన్నారు. ఉచిత రిజిస్ట్రేషన్, హాస్టల్ వసతి తదితర వివరాల కోసం 8522958575, 7032264910లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆవోపా బ్యాంక్ మెన్ చాప్టర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 2023లో తెలంగాణలో ఎంసెట్, నీట్, జేఈఈ, సివిల్స్‌లో వెయ్యి లోపు ర్యాంకులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థుల నుంచి ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్టు కన్వీనర్లు టీఎల్‌వీ రావు, డాక్టర్ కొత్త రామానందం, అధ్యక్షులు పి.వి.రమణయ్యలు తెలిపారు. హైదరాబాద్ కాచిగూడలోని వైశ్య హాస్టల్ ఆడిటోరియంలో జూన్ 18న జరిగే కార్యక్రమంలో వారిని బంగారు పతకాలతో సన్మానిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జూన్ 14లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 92905 29133, 94419 28528లలో సంప్రదించాలని సూచించారు.

బీసీలపై బీఆర్ఎస్ ప్రభుత్వం కపట ప్రేమ

కాచిగూడ: బీసీలపై బీఆర్ఎస్ ప్రభుత్వం కపట ప్రేమను చూపిస్తూ బీసీలను ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వినియోగించుకుంటోందని బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధానకార్యదర్శి కేశబోయిన శ్రీధర్ ఆరోపించారు. గురువారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో 50వేల మందికి పైగా బీసీలు ఉంటారని, వారందరికీ ఎలాంటి నిబంధనలు లేకుండా లక్ష రూపాయల పథకం ద్వారా లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు 53 శాతం మంది బీసీలు ఉన్నప్పటికీ బీసీలను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆయన విమర్శించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో గుణపాఠం చెబుతాం



కవాడిగూడ: మాలలకు జరుగుతున్న అన్యాయాలను, అవమానాలను ఎదుర్కొవడానికి తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఏర్పడిందని తెలంగాణ రస్ట్రా మాల సంఘంల జేఏసీ చైర్మన్ చెరుకు రామచందర్ పేర్కొన్నారు. గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాలలు సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మాలలకు మనోధైర్యాన్ని కల్పిస్తు సంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు. మాలల హక్కులకు భంగం కలిగించే వారిపై తమ పోరాటం ఉంటుందని తమ సత్తా ఏమిటో రాబోయే ఎన్నికల్లో ఓటు ద్వారా చూపిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర మాల సంఘం జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్, వర్కింగ్ చైర్మన్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

సందడిగా చెరువుల పండగ



బతుకమ్మను చెరువులో వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

అంబర్‌పేట: తెలంగాణలో అభివృద్ధి జరిగిందని ప్రజలకు తెలియజేయడానికి ప్రతి ప్రభుత్వ శాఖ తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. గురువారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండుగ కార్యక్రమాన్ని బాగ్‌అంబర్‌పేట మొయిన్ చెరువు కట్టపై నిర్వహించారు. కట్టపై బతుకమ్మ ఆటపాటలను సందడిగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాకతీయులు చెరువులు తవ్వించారని, వాటిని సీఎం కేసీఆర్ మిషన్ కాకతీయ పథకంతో పునరుద్ధరించి పరిరక్షించే బాధ్యతను తీసుకున్నారన్నారు. మొయిన్ చెరువు అభివృద్ధికి రూ.10.70 కోట్ల అంచనా వ్యయంతో పునరుద్ధరణ పనులు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. పుడిక తీత, రాతి కట్టడడంతో కట్ట అభివృద్ధి, అలుగుకు మరమ్మత్తులు చేపట్టామన్నారు. చెరువు నుంచి విడుదలయ్యే నీటి ప్రవాహ సమస్యను అధిగమించేందుకు రూ.22 కోట్లతో నాలల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, అధికారులు వేణుగోపాల్, జ్యోతిభాయి తదితరులు పాల్గొన్నారు.

మాల సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి



మహాధర్నాలో పాల్గొన్న మాలల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య, మాల సంఘాల ప్రతినిధులు

కవాడిగూడ: మాలల సామాజిక భవన నిర్మాణం కోసం స్థలాన్ని, నిధులు కేటాయించాలని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత బంధు మొదటి విడతలో మాలలకు తీరని అన్యాయం జరిగిందని, కనీసం రెండో విడతలో 50 శాతం యూనిట్లను మాలలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. మాలలను విస్మరించే శాసన సభ్యులకు వ్యతిరేకంగా మాలలు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. మాల సామాజిక భవనానికి స్థలం కేటాయించి నిధులు కేటాయించాలని, దళిత బంధులో మాలలకు 50 శాతం యూనిట్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఇందిరాపార్కు వద్ద మాల ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మాలల మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య, వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, డాక్టర్ మంచాల లింగస్వామి, కరణం బిషప్, గద్దె శ్రీనివాస్, పుష్ప భానుప్రకాస్, పేరోజు మహేశ్వర్, గోపోజు రమేష, జంగా శ్రీనివాస్, ఇందిర, శ్రీధర్, పూలరంగ, మన్నె రఘురాం పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాల కేటాయింపులో అన్యాయం జరిగిందన్నారు. తక్షణమే దళిత బంధు పథకంలో 50శాతం యూనిట్లకు మాలలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.ధర్నాలో మాల జేఏసీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ జిల్లాల నుంచి ప్రజలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల హౌస్ అరెస్టు



బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇంచార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డిని అడ్డుకున్న పోలీసులు

అంబర్‌పేట: బీఆర్ఎస్ నేతల హౌస్ అరెస్టు అంబర్‌పేటలో చర్చనీయాంశం అయింది. గురువారం బీఆర్ఎస్ పార్టీ అంబర్‌పేట నియోజకవర్గం ఇంచార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఛే నంబరు చౌరస్తాలో ఉన్న తన నివాసం నుంచి పార్టీ సీనియర్ నాయకులతో కలిసి తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఉత్సవాల్లో భాగంగా మొయిన్ చెరువుకు వెళ్లేందుకు సిద్ధపడగా అంబర్‌పేట పోలీసులు వచ్చి హౌస్ అరెస్టు చేశారు. దీనిపై ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎందుకు ఆకస్మాత్తుగా ఇలాంటి చర్యలు దిగారని పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. పార్టీ అధిష్టాం ఇచ్చిన పిలుపును ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గౌరవించకుండా తమను పోలీసులతో అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. ఎమ్మెల్యే చేసే ఇలాంటి చర్యలతో పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోతుందని, దీనిపై ఆధిష్టానానికి ఫిర్యాదు చేస్తామన్నారు. చివరకు పోలీసుల సూచన మేరకు మధ్యాహ్నం 2 గంటలకు ఎడ్ల సుధాకర్‌రెడ్డి తన మద్దతు దారులు మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులతో కలిసి మొయిన్ చెరువు వద్దకు వెళ్లి చెరువు పండుగను నిర్వహించారు.

డబుల్ ఇంజన్ సర్కర్‌తోనే పేదలకు న్యాయం



మాట్లాడుతున్న ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్

కవాడిగూడ: తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే పేద, మధ్య తరగతి ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎంపీ, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. గురువారం ముషీరాబాద్‌లోని హెరిటేజ్ ఫంక్షన్‌హాల్‌లో ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ సంయుక్త మోర్చా సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హజరైన డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ డబుల్ ఇంజన్‌తోనే తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని అన్నారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం ఎక్కడా కూడా లేదని కేవలం కేసీఆర్ కుటుంబంలో ఆ నలుగురికే న్యాయం జరిగిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంటుపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్‌గౌడ్, సి.కె.శంకర్‌రావు, కార్పొరేటర్లు సుప్రియానవీన్‌గౌడ్, పావని వినయ్‌కుమార్, రచనశ్రీ, ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం పాల్గొన్నారు.

ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్‌గా డాక్టర్ దిడ్డు సుధాకర్



డాక్టర్ దిడ్డు సుధాకర్‌ను గజ మాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు

కవాడిగూడ: రాష్ట్రంలో ఆమ్‌ఆద్మీ పార్టీ బోణీ కొడుతుందని ఆప్ తెలంగాణ రాష్ట్ర నూతన కన్వీనర్ డాక్టర్ దిడ్డు సుధాకర్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్ లిబర్టీ సర్కిల్ ఆప్ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆప్ తెలంగాణ ఇన్‌చార్జి ఎమ్మెల్యే సోమనాథ్‌భారతీ తనను తెలంగాణ రాష్ట్ర నూతన కన్వీనర్‌గా నియమించారని తనతో పాటు హరిచరణ్, శోభన్, బుర్ర రాముగౌడ్, అన్సారీ, బబుల్‌రెడ్డి, మజీద్, రంగయ్య, రాజు, రాథోడ్, తిరుమలరావులను ఆప్ నూతన తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులుగా నియమించారన్నారు.ఈ మేరకు ఢిల్లీలో నియామకపత్రాలను అందజే శారని పేర్కొన్నారు. అనంతరం కార్యకర్తలు శాలువాలతో, గజమాలలతో డాక్టర్ సుధాకర్‌ను ఘనంగా సత్కరించారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ మేడిబావి బస్తీలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ నల్ల పోచమ్మ దేవాలయ పునర్నిర్మాణానికి గురువారం బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ లక్ష రూపాయల చెక్కును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయన పునర్నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తున్నామని అన్నారు. మేడిబావి బస్తీ అధ్యక్షుడు ఆశోక్‌కుమార్ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



అంబర్‌పేటలో బడిబాట కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు

అంబర్‌పేట: బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అంబర్‌పేట డిప్యూటీ డీఈఓ విజయలక్ష్మి తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. గురువారం అంబర్‌పేట డివిజన్‌లో లకోటియా ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. నిర్వహించిన ర్యాలీలో పాల్గొని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆమె తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ముధుశాలిని, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

12న చలో కలెక్టరేట్



ముషీరాబాద్: తెలంగాణ వస్తే బతుకులు మారుతాయని ఎన్నో మాటలు చెప్పిన కేసీఆర్ గద్దె నెక్కిన తరువాత తిరోగమన పాలన సాగిస్తున్నారని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ప్రదీప్ అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం చేయాలని జూన్ 2 నుంచి 12 వరకు సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ ప్రజా ఆకాంక్ష దీక్ష దివస్‌ను నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా జూన్ 12న చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అంబర్‌నగర్, లలితానగర్, వారాసిగూడ, చిలకానగర్, మానికేశ్వర్ బస్తీ తదితర సెంటర్లో ప్రచారం నిర్వహించామన్నారు. అర్హులందరికీ డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని, ఇంటి స్థలాలు ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం 10 లక్షలు ఇవ్వాలన్నారు. రేషన్ కార్డు ఫించన్లు, ఇళ్ల స్థలాలు అర్హులందరికి అందించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.హన్మేష్, ఐఎఫ్‌టియూ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు ఎస్.ఎల్.పద్మ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. గురువారం ఆయన అడిక్‌మెట్ డివిజన్ ఎస్‌వీఎస్ గల్లీ, అచ్యుత్‌రెడ్డిమార్గ్, పాతీమా మసీదు లైన్‌లలో రూ.36 లక్షల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ సి.సునీతాగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బస్తీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్, రోడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటుపెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఇటీవల అచ్యుత్‌రెడ్డి మార్గ్‌లో వీడీసీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామని, మిగిలి ఉన్న మిగతా రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. సాధ్యమైనంత తొందరగా రాంనగర్ రామాలయం వీధిలో డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టి ముదుగు నీటి లీకేజీ సమస్యకు పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. ఇందు కోసం రూ.20 లక్షలు మంజూరు చేయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిఈ సన్నీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా పైప్‌లైన్ వ్యవస్థ ఆధునికీకరణ



అజాద్‌నగర్‌లో డ్రైనేజీ పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

అంబర్‌పేట: కాలం చెల్లిన తాగునీరు, డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థను దశలవారీగా ఆధునీకరించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. గురువారం అంబర్‌పేట డివిజన్ ఆజాద్‌నగర్‌లో రూ.8 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన డ్రైనేజీ పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో మెజారీటి బస్తీలు, కాలనీల్లో పైపులైన్ వ్యవస్థను ఆధునీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి అధికారులతో పాటు బీఆర్ఎస్ నాయకులు సిద్ధార్థ ముదిరాజ్, జాఫర్, మహేశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన చేపల మార్కెట్

ముషీరాబాద్: ముషీరాబాద్ చేపల మార్కెట్ వినియోగదారులతో కిటకిటలాడింది. మృగశిరకార్తె సందర్భంగా వినియోగదారులు ముషీరాబాద్ చేపల మార్కెట్‌కు భారీ ఎత్తున పోటెత్తారు. ఈ సందర్భంగా రవ్వ, బొచ్చ చేపలతో పాటు కొర్రమీనూ చేపల ధరలకు రెక్కలు వచ్చాయి. కొర్రమీను 600-650 వరకు కేజీ ధర పలికింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల నుంచి భారీ ఎత్తున చేపలు దిగుమతి అయ్యాయి.

కమ్యూనిటీహాల్‌లో వార్డు కార్యాలయం ఏర్పాటు వద్దు

చిక్కడపల్లి : జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో గాంధీనగర్ డివిజన్ వార్డ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు ఎందుకు యత్నిస్తున్నారని కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ అధికారులపై అగ్రహం వ్యక్తం చేశారు. కమ్యూనిటీహాల్‌ను మళ్లీ వార్డ్ కార్యాలయంగా మార్చే యత్నం జరుగుతుందనే సమాచారం అందడంతో గాంధీనగర్ కార్పొరేటర్ గురువారం స్థానికులతో కలసి సందర్శించారు. డీఎంసీ, డీఈఈలతో ఫోన్‌లో మాట్లాడి ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మరోసారి సమాచారలోపం లేకుండా వ్యవహరిస్తామని వారు కార్పొరేటర్‌కు వివరించారు.

త్యాగరాయగానసభ ఉచిత కల్యాణ వేదికపై వివాహం



చిక్కడపల్లి: త్యాగరాయగానసభలోని కల్యాణవేదికలో గురువారం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి ఈ సందర్భంగా వైష్ణవి, పవన్‌కుమార్‌ల వివాహానికి సహకరించారు. ఈ వివాహానికి అవసరమైన హాలు, వెండి కాలి మెట్టలు, బంగారు మాంగల్యం అందించడంతోపాటు భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు.

కొడవలి సత్యానారాయణ రచనలు స్ఫూర్తిదాయకం

అంబర్‌పేట: కొడవలి సత్యానారాయణ రచనలు ప్రజల్లో స్ఫూర్తినిచ్చేవని ప్రముఖ సాహితివేత్త బి.జయరాములు తెలిపారు. అన్నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం అంబర్‌పేటలో కొడవలి సత్యానారాయణ 6వ వర్ధంతి జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ అతిథిగా విచ్చేసి సాహితీ రంగంలో కృషి చేసిన పలువురికి సాహితీ పురస్కారాలను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా బీ. జయరాములు మాట్లాడుతూ సత్యానారాయణ రచించిన నడిచే నక్షత్రాలు, హృదయనాథం వంటి రచనలు ఎంతో ఆదరణ పొందాయన్నారు. కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు డాక్టర్ వరలక్ష్మీ, శ్రీదేవి నాయుడు, అబ్దులు సమద్, రామకృష్ణ చంద్రమౌళి, జేవి.కుమార్, ఆర్.ప్రవీణ్ కుమార్‌లు ఉన్నారు.

10న ఉడపచార్ శతజయంతి వేడుక

కాచిగూడ: కర్ణాటక శిక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 10న సాయంత్రం 5:30 గంటలకు కాచిగూడలోని నృపతుంగ స్కూల్ ప్రాంగణంలో ఎస్.ఉడపచార్ శత జయంతి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కర్ణాటక శిక్షణ సమితి కార్యదర్శి ముకుంద్ కులకర్ణి తెలిపారు. కాచిగూడలోని కర్ణాటక శిక్షణ సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నృపతుంగ విద్యా సంస్థల పురోభివృద్ధికి ఉడపచార్ చేసిన కృషి ప్రశంసనీయమని అన్నారు. కార్యక్రమంలో టి.రాంమూర్తి, హరిసరోత్తం, సుదేంద్ర కులకర్ణి, రాఘవేంద్ర దేశాయ్, కృష్ణ పురోహిత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

నల్లకుంట : మృగశిర కార్తెని పురస్కరించుకొని గురువారం బాగ్ అంబర్‌పేటలో గల శ్రీ షిరిడీ సాయి బాబా ఆలయం భక్తులతో పోటెత్తినది. ఈ సందర్భంగా ఉదయం అర్చక స్వాములు సాయిబాబాకు క్షీరాభిషేకం కావించి, హారతి ఇచ్చారు. అనంతరం సుమారు ఐదు వందల మంది పేదలకు అన్నదానం చేశారు.

ప్రయాణికురాలి బంగారు ఆభరణాల అందజేత

కాచిగూడ: లగేజీను స్కానర్‌లో మరచిపోయిన బ్యాగును ప్రయాణికురాలికి ఆర్‌పీఎఫ్ పోలీసులు అప్పగించారు. వివరాలు.. కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన లావణ్య గోపాలన్ విశాఖపట్నం వెళ్ళడానికి ఈ నెల 6వ తేదీన సాయంత్రం కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చింది. రైల్వే స్టేషన్‌లో లగేజీను స్కానర్‌లో ఉంచి అలాగే వెళ్లిపోయింది. బ్యాగ్‌లో ల్యాప్‌టాప్‌తో పాటు 20 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. దీంతో ఆమె ఆర్‌పీఎఫ్ కాచిగూడ పోలీసులకు సమాచారం అందించారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేంద్ర కుమార్, ఎస్ఐ ఎస్.మనోజ్ కుమార్ రెడ్డిలు సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా ఆమె తన లగేజీ స్కానర్‌లో మర్చిపోయిందని గుర్తించారు. పొరపాటున మరొక ప్రయాణీకుడు ఆ బ్యాగును తీసుకొని వెళ్లాడు. ఫ్లాట్‌ఫారం-3 పై అతన్ని పోలీసులు గుర్తించారు. పొరపాటున బ్యాగ్ తీసుకున్నాడని చెప్పాడు. దీంతో దానిని లావణ్య గోపాలన్‌కు అందజేశారు. బ్యాగ్‌లో బంగారు ఆభరణాలు, ల్యాప్ టాప్ మొత్తం రూ. 12,50,000 విలువైన వస్తువులు ఉన్నాయి.

గుర్తుతెలియని వ్యక్తి మృత దేహం లభ్యం

కాచిగూడ: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు తెలిపిన మేరకు.. గుర్తుతెలియని వ్యక్తి (55) గురువారం కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద అనారోగ్యంతో చిపోయాడు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్

కాచిగూడ: సెల్ ఫోన్ దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రావు తెలిపిన వివరాల ప్రకారం... చుడీబజార్ ప్రాంతానికి చెందిన చేతన్ భాటి (25), అసద్ బాబానగర్ ప్రాంతానికి చెంది. యూసుఫ్ పటేల్ (41) ప్రయాణికుడి సెల్‌ఫోన్ ను దొంగిలించారు. గురువారం వారిని అదుపులోకి తీసుకుని సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

గౌడ బంధును ప్రకటించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రభుత్వం ప్రకటించిన ఏ పథకంలోనూ గౌడ్‌లు, కల్లుగీత వృత్తిదారుల ప్రస్తావన లేకపోవడం బాధాకరమని, తక్షణమే గౌడ బంధును ప్రకటించి ప్రతి గౌడ కులానికి పది లక్షల రూపాయలు ఇవ్వాలని గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఐయిలి వెంకన్నగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా ప్రభుత్వం పది బడ్జెట్‌లు ప్రవేశపెడితే ఏ బడ్జెట్‌లోనూ ఒక్కపైసా కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గౌడల సంక్షేమాన్ని విస్మరించిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం అని అసలు గౌడలు బీసీలు కాదా అని అన్నారు. గౌడలను విస్మరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఒక్క ఎమ్మెల్సీ, రాజ్యాసభ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2014లో కార్పొరేషన్‌ను రద్దు చేసి బీసీ కార్పొరేషన్‌లో విలీనం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని విమర్శించారు.